## క్లుప్తంగా

### తాగునీటి పైపులైన్ ఏర్పాటు

సిద్దవటం : మండలంలోని ఖాజీపల్లె గ్రామ తాగునీటి సమస్యకు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టారు. రూ.3లక్షలతో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్ పరిశీలించారు. పైప్‌లైన్ ఏర్పాటుకు చొరవ చూపిన సర్పంచ్ లక్ష్మిదేవికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎగువపేట, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో అర్హులైన గృహ నిర్వాహకులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె స్మార్ట్ రేషన్‌కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాబయ్య, వీఆర్ఓ కేశవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ స్కూల్ తనిఖీ

సిద్దవటం : విద్యార్థులకు అందించే ఆహారంలో పౌష్టికాహార లోపం ఉండకూడదని ఎంపీడీఓ ఫణిరాజకుమారి ఆదేశించారు. శనివారం ఆమె ఎగువపేటలోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం లోపం లేకుండా చేయాలన్నదే సంకల్పమని, ప్రతి అంగన్‌వాడీ సిబ్బంది విధిగా పౌష్టికాహారం చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు అందించాలని తెలియజేశారు. స్కూలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

### క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

సుండుపల్లె : దిన్నెమీద బలిజపల్లికు చెందిన బోనంసెట్టి నాగరాజ కుమారుడు నాగచైతన్య(14) బోన్ బ్లడ్ క్యాన్సర్‌తో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పెద్దబలిజపల్లి సేవా సంఘం అధ్యక్షులు నంద్యాల నాగరాజ, కమిటీ సభ్యులు, దాతల సహకారంతో నాగచైతన్య ఆరోగ్యానికి తండ్రి నాగరాజుకు కువైట్‌లో రూ.1,14,815 ఆర్థికసాయం అందజేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల నాగరాజ, కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

### నవోదయన్ ఆఫ్ ది ఇయర్‌గా జనార్దన్



అవార్డు అందుకుంటున్న జనార్దన్

సంబేపల్లె : మండలంలోని పేయలవాండ్లపల్లెకు చెందిన బుక్కే జనార్దన్‌కు నవోదయన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించింది. ఇటీవల పూణెలో జరిగిన ఆరవ నవోదయ ఆలమ్నీ కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు ఈ అవార్డు అందజేసినట్లు చెప్పారు. టీటీడీలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఆఫీసు సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జనార్దన్ మదనపల్లి నవోదయ పాఠశాల 1992 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో చేరారు. సామాజిక సేవలో ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమని ఆలమ్నీ కమిటీ సభ్యులు తెలిపారు. అవార్డు సాధించటం పట్ల తోటి ఉద్యోగులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

### 29న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

రాజంపేట రూరల్ : ఆర్‌అండ్‌బీ వద్ద నుంచి 29న చేపట్టే రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని జయప్రదం చేసుకుందామని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కె.బోయినపల్లిలోని అన్నమయ్య పార్కులో శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 3 గంటలకు ఆర్‌అండ్‌బీ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ పాత బస్టాండు వైఎస్సార్ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. ర్యాలీలో దళితుడు పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య, అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లికార్జున, ఉపాధ్యక్షులు ఎంవీ రమణ, మాల మహానాడు నాయకులు జె.భాస్కర్, దళిత సీనియర్ నాయకులు ఎ.విశ్వనాథ్, జిల్లా మానవ హక్కుల అధ్యక్షులు జల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### నివాళి



నివాళి అర్పిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దిన్నెపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గజేంద్రారెడ్డి తండ్రి శివప్రతాప్ రెడ్డి దశదిన కర్మఖాండ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డిలు పాల్గొని శివప్రతాప్ రెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, వలీ, పఠాన్, అయూబ్ ఖాన్, ఉప సర్పంచ్ రఫీ, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, కో-ఆప్షన్ మాజీ సభ్యులు సిరాజ్, వినయ్ కుమార్ రెడ్డి, సుబ్బరాజు, గంగిరెడ్డి, దర్బార్ పాల్గొన్నారు.

# కరుణించు.. కమలాంబిక

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కాలేజీలకు కూడా సెలవులు ఇవ్వడంతో ప్రధాన వీధులతోపాటు అమ్మవార్లు కొలువైన ఆలయ ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు జరిపి అలంకరించారు. సాయంత్రం ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవీ స్వరూపిణీలను దర్శించుకునేందుకు భక్తులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాలను అందించగా, పోలీసులు బందోబస్తు కల్పించారు. కాగా రాజంపేట అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి మీనాక్షీదేవి రూపంలో భక్తులను కటాక్షించారు.



రామాపురం: గజలక్ష్మీదేవి అలంకారంలో దర్గా మాతాజీ



నందలూరు: శ్రీ మీనాక్షిదేవి అలంకారంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



రాజంపేట టౌన్: విజయలక్ష్మీ దేవిగా వీరచౌడేశ్వరీదేవి



రాజంపేట టౌన్: తిరువారూరు కమలాంబికగా మారెమ్మ



సుండుపల్లెలో లలితాదేవి అలంకారంలో అమ్మవారు



ఒంటిమిట్ట: శ్రీ త్రిపురసుందరి దేవి అలంకారంలో వాసవాంబ



సిద్దవటం: కామాక్షిదేవి అలంకరణలో శ్రీ గంగాభవానీ



సిద్దవటం: శ్రీ లలితాదేవి అలంకరణలో దుర్గాదేవి



రాయచోటి టౌన్: రాజరాజేశ్వరీ దేవిగా పార్వతీ దేవి (చెక్‌పోస్ట్ వద్ద)



పెనగలూరు: బాలాత్రిపుర సుందరీగా కామాక్షీదేవి



పుల్లంపేట: అలంకారంలో మారమ్మ



చిట్వేలి: లలితాదేవి అలంకారంలో శ్రీ భద్రకాళి మాత




గాలివీడు: శ్రీ మహాలక్ష్మిగా ఇరుగులమ్మ



రాయచోటి జగదాంబ సెంటర్: అగస్త్యేశ్వరాలయంలో..



చిన్నమండెం: దేవగుడిపల్లెలో మోహినీదేవిగా శ్రీ కాళికామాత



రాయచోటి టౌన్: శ్రీ భవానీ దేవి రూపంలో కన్యకాపరమేశ్వరీ



రాజంపేట రూరల్: అలంకరణలో కనకదుర్గమ్మ



రాజంపేట టౌన్: అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



నందలూరు: అమ్మవారిశాలలో పూజల్లో పాల్గొన్న భక్తులు

# నల్లగంగమ్మా.. మన్నించమ్మా!



వైఎస్సార్‌సీపీ హయాంలో దసరా ఉత్సవాలలో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న నల్లగంగమ్మ



దసరా సందడి లేక బోసిపోయి కనిపిస్తున్న ఆలయం (ఇన్‌సెట్) నల్లగంగమ్మ మూలవిరాట్టు

- మహిమాన్విత క్షేత్రంలో కనిపించని శరన్నవరాత్రి సందడి
- అమ్మవారి ఆలయంపై నిర్లక్ష్యం చేస్తున్నారంటూ భక్తుల వేదన
- జగన్ హయాంలో ఆలయాభివృద్ధితో పాటు వైభవంగా ఉత్సవాలు
- తీరు మార్చుకొని ఉత్సవాలు నిర్వహించాలంటూ భక్తుల వేడుకోలు

సంబేపల్లె : జిల్లాలో ప్రముఖ అమ్మవారి దేవాలయాలలో శ్రీ నల్లగంగమ్మ ఆలయం ఒకటి. సాధారణ రోజుల్లో భక్తుల రద్దీ పదుల సంఖ్యలో ఉంటుండగా, ఆదివారం నాడు ఆలయానికి వందల నుంచి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటుంటారు. అలాంటి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందడి కానరాక బోసిపోయి కనిపిస్తోంది. నవరాత్రి ఉత్సవాల మొదలయ్యాయి అంటే వివిధ రూపాల్లో దర్శనమిచ్చి కటాక్షించే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. గత రెండు దసరా ఉత్సవాలను నుంచి ఎటువంటి కార్యక్రమాలు జరపకపోతుండటంతో భక్తులు ఆవేదన లోనవుతున్నారు.

**కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి**

ఈ క్షేత్రంలో అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. అలాంటి ఆలయం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందనే వాదన భక్తుల నుంచి వినిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.1.20 కోట్లను అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కేటాయింపజేసేలా చొరవ తీసుకుని ఆలయ అభివృద్ధికి బాటలు వేశారు. అలానే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేవారు. రోజుకొక రూపంలో అమ్మవారు దర్శనమిచ్చి భక్తులకు అభయం ప్రసాదించేది. అలానే దసరా ఉత్సవాల సమయంలో నిర్వహించే హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చన వంటి పూజల్లో మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనేవారు. ఈ సంవత్సరమైనా అమ్మవారి ఉత్సవాలు జరుపుతారేమో భక్తులు పెట్టుకున్న ఆశలపై ఇటు దేవదాయ శాఖ అధికారులు.. అటు పాలకులు నీళ్లు చల్లారు.

**బోసిపోయి కనిపిస్తున్న ఆలయం**

శరన్నవరాత్రి ఉత్సవాలు జరపకపోవడంతో ఆలయానికి భక్తుల రాక కాస్త తగ్గిందనే భావన ఉంది. నల్ల గంగమ్మ ఆలయంపై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియక భక్తులు వేదన చెందుతున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలలో చిన్న చిన్న దేవాలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు జరిపి సాయంత్రం శక్తి స్వరూపిణీలుగా అలంకరించి దర్శనభాగ్యం కల్పిస్తారు. అలాంటిది సంబేపల్లె మండలానికి వన్నెతెచ్చిన క్షేత్రం నల్లగంగమ్మ ఆలయంలో ఉత్సవాలు జరగకపోవడంపై కూటమి ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మహిమాన్విత క్షేత్రమైనా నల్లగంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి శోభ విరాజిల్లేలా నిర్వహించాలని భక్తులు అధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి

రాజంపేట టౌన్ : మండలంలోని చుండువారిపల్లెలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కడురమణీయంగా జరిపించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ నాగుల దుర్గాప్రసాద్, అవధానం కుమార్‌శర్మల నేతృత్వంలో స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం జరుగుతున్నంతసేపు భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఉండిపోయారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు వేలాది మంది భక్తులు చుండువారిపల్లెకు తరలివచ్చారు. వేడుకలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం కల్యాణ ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

**వేంకటేశ్వరుడికి పూజలు**

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం ఆరోగ్యపురం ఎంజీఆర్ కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. పూలు, ఆభరణాలతో స్వామివారిని చక్కగా అలంకరించారు. వచ్చిన భక్తులు స్వామి వారిని, ఆంజనేయస్వామిలను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## జర్నలిస్టులకు శిక్షణా తరగతులు



ఏపీయూడబ్ల్యూజే నాయకులతో మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి తెలియజేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం యూనియన్ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జర్నలిజంపై శిక్షణా తరగతులు నిర్వహించలేదన్నారు. యూనియన్‌లకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ శిక్షణా తరగతులలో పాల్గొనవచ్చన్నారు. శిక్షణలో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్‌తో పాటు గైడ్‌లైన్స్‌ను తెలియజేసే పుస్తకాలను అందజేయనున్నట్లు తెలియజేశారు. తరగతుల తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. అలానే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ సభ్యులు(జర్నలిస్టులు) బచోటి భాస్కర్, ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, మలిశెట్టి సుబ్బనరసింహులు, జీవీపీఆర్‌కే రాయుడు, ఉదయగిరి కల్యాణ్, మండ్ల శ్రీహరీ, శివయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, బి.నాగేంద్ర ప్రసాద్, పి.దుర్గయ్య, మధుసూదన్‌నాయుడు, చౌడవరం నరసింహ, రవీంద్ర పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికితీసేందుకే ‘హాకథాన్’



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న అధ్యాపకులు

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని సాయి కళాశాల అధ్యాపకులు సూచించారు. శనివారం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హాకథాన్ - 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు హాకథాన్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల ప్రతిభను దేశానికి పరిచయం చేయడమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. హాకథాన్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటరమణ, సీఎస్ఈ హెచ్‌ఓడీ సుబహాన్, ఈసీఈ హెచ్‌ఓడీ కరుణాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రాక్టికల్ అనుభవం పొందాలి**

విద్యార్థులు క్లాస్ రూం లెర్నింగ్‌తో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని కూడా పొందాలని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కోసం ప్రత్యేక ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ముఖ్య రీసోర్స్ పర్సన్‌గా హాజరైన డాక్టర్ మహేష్ పవన్ సాతపల్లి మాట్లాడుతూ ఎంబీఏ విద్య అనేది కేవలం ఒక డిగ్రీ కాదు అది భవిష్యత్తుకు మార్గదర్శకమని తెలియజేశారు.

## మైనర్లకు వాహనాలిస్తే జరిమానా

రాయచోటి టౌన్ : మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాల యజమానులకు భారీ జరిమానా విధించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాయచోటి సీఐ బీవీ చలపతి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని వేర్వేరు చోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్కూటర్లు నడుపుతున్న మైనర్లను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి వారి తల్లిదండ్రులు, వాహన యజమానులను పిలిపించారు.

సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనలు ఇవ్వడం వలన ప్రమాదాలకు గురవుతారని అందుకు కారకులు వాహనాలు ఇచ్చిన వారే అనేది మర్చిపోకూడదని చెప్పారు. వాహనాలు ఇచ్చిన యజమానులకు జరిమానా విధించారు. ఇకపై మళ్లీ వాహనాలు ఇస్తే మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు.

## అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ అనుబంధ నాయకులు

రాయచోటి టౌన్ : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తామని ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి అన్నారు. శనివారం రాయచోటి ఎన్‌జీఓ హోంలో వైవీ శివయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ సీఐటీయూ అనుబంధం సంఘం నుంచి ఐఎఫ్‌టీయూలో చేరిన అంగన్‌వాడీలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తామని చెప్పారు. రాష్ట్రంలో వర్కర్ల దగ్గర వెట్టిచాకిరి చేయించుకొని తగిన పారితోషికం చెల్లించడం లేదని మండిపడ్డారు. సంక్షేమ పథకాల దగ్గరకు వచ్చేటప్పటికి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తుండటాన్ని తప్పుబట్టారు. అనంతరం ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాయపాటి హరికృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం పెద్ద సంఘంగా చెప్పుకొంటున్న సీఐటీయూ దాని అనుబంధం సంఘం అధికారులతో లాలూచి పడుతుండటంతో సకాలంలో వేతనాలు, బకాయిలు అందకుండా పోతున్నాయన్నారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా బంగారు పాప, జిల్లా కో కన్వీనర్‌లుగా కల్పలత, నసీబ్‌జాన్‌లతో పాటు మరి కొందరితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## బోరు మోటార్లను ఎవరెత్తుకెళ్లారో తేల్చాలి



మోటారు లేని బోరును చూపిస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామం జగనన్న కాలనీలో రెండు బోరు మోటార్లు దొంగలెత్తికెళ్లారా.. లేక అధికారులే తీసుకెళ్లారా అనేది అర్థంకాని విషయంగా మారిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ ప్రశ్నించారు. శనివారం ఆ గ్రామంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జగనన్న కాలనీ నిర్మాణం కోసం మౌలిక వసతుల కల్పన కింద రెండు బోర్లు వేసి వాటికి మోటార్లు కూడా అమర్చారన్నారు. ఈ మోటర్ల ద్వారా వచ్చే నీటితో అవసరాలకు ఉపయోగించుకొంటూ ఇళ్ల నిర్మాణాలను చేసుకుంటున్నారని చెప్పారు. అయితే కొన్ని రోజులు క్రితం గుర్తు తెలియని వ్యక్తులు రెండు మోటార్లు, వాటికి ఉపయోగించిన వైర్లు ఎత్తుకెళ్లారని ఆరోపించారు. అయితే అధికారులు దీనిపై ఫిర్యాదు కూడా చేయకపోవడంపై అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేసి ఎత్తుకెళ్లిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

## రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

రాయచోటి టౌన్ : రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కంచుకోవాలని జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి సూచించారు. శనివారం రాయచోటి కోర్టులో మీడియేటర్ (మధ్యవర్తిత్వ) కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియేషన్‌లో ప్రభుత్వం ద్వారా శిక్షణ పొందిన న్యాయవాదులు ఆనంద్‌కుమార్, మంద నాగేశ్వరావులు ఉన్నారని, కేసులను మీడియేషన్ పద్ధతిలో పరిష్కరించుకోవాలని సూచించారు.

## కామ్రేడ్ సుధాకర్ ప్రసాద్ ఆదర్శప్రాయుడు



నివాళులర్పిస్తున్న అడహక్ కమిటీ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : కామ్రేడ్ సుధాకర్ ప్రసాద్ నేటి కార్మికులకు ఆదర్శప్రాయుడని తాలూకా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఎం.వరదయ్య కొనియాడారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో శనివారం సుధాకర్ ప్రసాద్ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో శ్రీనివాసరాజు, హరిప్రసాద్‌రాజు, టి.వెంకటసుబ్బయ్య, డి.మణి, ఎస్.పెంచలరాజు, జె.హరికృష్ణ, కవిత వాణిలు ఉన్నారు.